





ప్లాట్‌ఫారాలు లేక మండిపోతున్న ఎండల మధ్య రైతులు తెచ్చిన మిర్చి బస్తాలు

# వ్యాపారికి అండ.. రైతుకు ఎండ...!

- మండుటెండలో పంట ఉత్పత్తులు
- ఉన్న ప్లాట్‌ఫారాలు వ్యాపారాలకు ధారాదత్తం
- అమ్మకాల కోసం అన్నదాతల ఎదురు చూపు
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో రూ.కోట్లు ఖర్చు పెట్టి ఏర్పాటుచేసిన గోదాములను వ్యాపారులకు ధారాదత్తం చేస్తున్నారు. దీంతో రైతులు అమ్మకానికి తెచ్చిన పంట ఉత్పత్తులు మండు టెండలో మాడిపోతున్నాయి. ఎప్పుడెప్పుడు కొనుగోలు చేస్తారా అని వ్యాపారుల కోసం రైతులు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. గుంటూరు మిర్చి యార్డు తర్వాత అదేస్థాయిలో కర్నూలు మార్కెట్ యార్డుకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా తెలంగాణ ప్రాంతం నుంచి ఎండుమిర్చిని రైతులు అమ్మకానికి తెస్తున్నారు. ప్రస్తుతం 500 క్వింటాళ్ల దాకా ఎండుమిర్చి అమ్మకానికి వస్తోంది. అయితే.. ఎర్రని ఎండలకు మిర్చి రైతులు పడుతున్న ఆగచాట్లను మార్కెట్ కమిటీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ మార్కెట్ కమిటీకి చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ప్రతి నెలా సమీక్ష చేసేందుకు ఏడీఎం కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారే తప్పా కూతవేటు దూరంలోని మిర్చి యార్డులో రైతులు పడుతున్న ఆవేదనను మాత్రం పట్టించుకోవడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి రైతులు తెస్తున్న ఎండు మిర్చిని వెంటవెంటనే వ్యాపారుల చేత కొనుగోలు చేయించేందుకు మార్కెట్ కమిటీ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### రూ.కోట్లు ఖర్చు పెట్టి.. వ్యాపారులకు కట్టబెట్టి:

ఎండలు, వర్షాలకు రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను కాపాడేందు కోసం ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్లాట్‌ఫారాలను ఏర్పాటు చేసింది. అయితే కర్నూలు మార్కెట్ యార్డులో ప్లాట్‌ఫారాలన్నీ వ్యాపారుల వశం చేసేశారు. ఈ యార్డులో మిర్చి వ్యాపారులకు రూ.కోట్ల విలువ చేసే ప్లాట్‌ఫారాలను వ్యాపారులకు ఉచితంగా ధారాదత్తం చేయడంపై అన్నదాతలు ఇదేమీ దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్‌ఫారాల్లో వ్యాపారులు మిర్చిని నిల్వ చేసుకున్నందుకు వారి నుంచి ఒక్క రూపాయి కూడా మార్కెట్ కమిటీ అధికారులు వసూలు చేయడం లేదు. కొంత మంది వ్యాపారులు అక్కడే ఎలక్ట్రానిక్ కాటాలు ఏర్పాటు చేసుకొని రిటైల్‌గా వినియోగదారులకు అమ్ముకుంటున్నారు. దీని వల్ల మార్కెట్ కమిటీకి ఎటువంటి ఆదాయం లేకపోగా రైతులు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

### కనికరం లేని అధికారులు

దూర ప్రాంతాల నుంచి మండుతున్న ఎండలను లెక్క చేయకుండా రైతులు ఎండుమిర్చిని కర్నూలు మార్కెట్‌యార్డుకు తెస్తున్నారు. ఈ ఎండుమిర్చిని ప్లాట్‌ఫారాల్లో నిల్వ చేసి విక్రయాలు చేపట్టాల్సిన బాధ్యతను మార్కెట్ కవిటీ అధికారులు ఎప్పుడో మరిచిపోయారు. వ్యాపారుల అవసరాన్ని మాత్రమే వీరు గుర్తించి వారికి వసతులు ఏర్పాటు చేస్తున్నారే తప్పితే.. తమను ఎందుకు పట్టించుకోవడం లేదని మిర్చి రైతులు గొల్లుమంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాట్‌ఫారాలను రైతుల కోసం వినియోగించాల్సిన అవసరం ఉంది.

### వ్యాపారులకు ప్లాట్‌ఫారాన్ని కేటాయించాం



కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు అవసరమైన ప్లాట్‌ఫారాలు లేవు. దీని వల్ల ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. మిర్చి వ్యాపారాన్ని అభివృద్ధి చేసి పన్నును పెంచేందు కోసమని మిర్చి వ్యాపారులకు ప్లాట్‌ఫారాన్ని కేటాయించాం. ఈ వ్యవహారంలో ఎటువంటి నిర్లక్ష్యం లేదు. ప్రస్తుతం మిర్చి వ్యాపారులకు వారి సొంత ఖర్చుతోనే షాపులు నిర్మించుకునేలా నిర్ణయం తీసుకున్నాం. ప్లాట్‌ఫారాల్లో మిర్చిని వ్యాపారులు నిల్వ చేసుకుని గిరాకీ వచ్చిన వెంటనే బయటకు తరలించాలని ఆదేశించాం.

- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ



రూ.కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన మిర్చి ప్లాట్‌ఫారం వ్యాపారులకు ధారాదత్తం

### ఇంత దారుణం ఎక్కడా లేదు



నేను దాదాపు రూ.5 లక్షలు ఖర్చు పెట్టి రెండెకరాల్లో మిర్చి పంటను సాగు చేశా. అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా 20 బస్తాల ఎండుమిర్చి మాత్రమే చేతికందింది. కనీసం ఈ ఎండుమిర్చిని అమ్ముకుందామని గుంటూరు మార్కెట్‌కు వెళ్లకుండా శనివారం తెల్లవారుజామునే కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చాను. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండుతున్న ఎండకు ఎప్పుడెప్పుడు కొంటారా అని వ్యాపారుల కోసం ఎదురు చూస్తూనే ఉన్నాను. టెండరు ఫారాలు వ్యాపారుల చేతికి మధ్యాహ్నం తర్వాతనే వస్తాయని చెబుతుండటంతో మా ప్రాణాలు పైపైనే పోతాయోనని ఆందోళనగా ఉంది.

- లింగమయ్య, ఎల్కూరు, గూడూరు మండలం

### ప్లాట్‌ఫారాలను వ్యాపారులకు ఇస్తారా?



రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం మా పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు గోదాములను, ప్లాట్‌ఫారాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అధికారులు, వ్యాపారుల నుంచి ఏం ప్రయోజనం పొందుతున్నారో గానీ ప్లాట్‌ఫారాలను వ్యాపారులకు ధారాదత్తం చేస్తున్నారు. కర్నూలు మార్కెట్ కమిటీలో మిర్చి ప్లాట్‌ఫారాలను వ్యాపారులకు ఉచితంగా ధారాదత్తం చేశారు. దీంతో మండుటెండలకు మాతోపాటు తెచ్చిన మిర్చి బస్తాలు ఎర్రని ఎండలకు మాడిపోవాల్సిన దుస్థితి దాపురించింది. వ్యాపారులు కోరిన వెంటనే వారికి షాపులు కేటాయిస్తున్నారు. మిర్చి బస్తాలను ప్లాట్‌ఫారాల్లో నిల్వ చేసి ఎందుకు విక్రయాలు చేపట్టడం లేదో అధికారులే సమాధానం చెప్పాలి.

- మద్దిలేటి, గూడూరు

# దేశప్రగతిని మార్చిన వ్యక్తి అంబేడ్కర్

- న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

నంద్యాల టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతిని మార్చిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొనియాడారు. సోమవారం డా.బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ రాజాకుమారితో కలిసి బొమ్మలసత్రంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నంద్యాల పురపాలక కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, హక్కుల సాధనకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. రాజ్యాంగ రచనలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆయన కృషితోనే భారత్ ప్రపంచంలోనే బలమైన ప్రజాస్వామ్య దేశంగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. దేశంలో అంటరానితనాన్ని రూపుమాపడానికి అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, కమిషనర్ నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

# రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



నివాళి అర్పిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 14 ( ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత, గొప్ప మేధావి డా.బీఆర్ అంబేడ్కర్ అని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కొనియాడారు. సోమవారం బనగానపల్లె పట్టణంలోని అవుకు మెట్టవద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి, దళితులకు అందించిన సేవలను మరువలేమన్నారు. అంబేడ్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం గౌరవించి ఆయన జయంతి రోజును సెలవుదినంగా ప్రకటించిందన్నారు. టీడీపీ ఆది నుంచి దళితులకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. దళితులైన సీఎంసి బాలయోగి, ప్రతిభాభారతి, వంగలపూడి అనిత వంటి వారికి ఉన్నతపదవులు ఇచ్చి గౌరవించిన పార్టీ టీడీపీ అన్నారు. అంబేడ్కర్ దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప యోధుడన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బురానుద్దీన్, కాశీంబాబు, కాట్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, కాశీంభాష, సలాం, పూలకలాం, నియాజ్, అహ్మద్‌హుసేన్, భూషన్న మంగంపేట శ్రీను ఎంపీడీవో రమణ, ఏఈ సాయికృష్ణ, వెంకటేశ్వరరావు, రాందాసురెడ్డి, బిజెపీ నాయకుడు శివకృష్ణ, అధిక సంఖ్యలో టీడీపీ దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

# మరణంలోనూ వీడని స్నేహబంధం



నుజ్జునుజ్జయిన కారు



వినోద్ (ఫైల్)



ధర్మారెడ్డి(ఫైల్)



తేజనాయుడు (ఫైల్)

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం
- మహానంది కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు
- కడప రిమ్స్‌కు తరలింపు
- యువకుల కుటుంబాల్లో తీరని విషాదం
- కన్నీరుమున్నీరైన బంధువులు
- కడప జిల్లా ఒంటిమిట్ట వద్ద ఘటన

నంద్యాల, ఏప్రిల్ 14( ఆంధ్రజ్యోతి): ఒకరి వైద్య చికిత్సల కోసం వెళ్లిన ఆ నలుగురు స్నేహితులు.. సహాయం చేసేందుకు వెళ్లిన వారిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఈప్రమాదంలో ముగ్గురు మిత్రులు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా నంద్యాల జిల్లా వాసులే. ఈఘటన కడప జిల్లా ఒంటిమిట్ట మండలం నడింపల్లి వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాలలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన తేజనాయుడు(21) పట్టణంలో ఐటీఐ విద్యను అభ్యసిస్తున్నాడు. ఇదేకాలనీకి చెందిన సమీప బంధువు సునీల్‌నాయుడు 2011లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఇతను మహానంది పోలీసుస్టేషన్‌లో రెండేళ్లుగా కోర్టు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అయితే వీరిద్దరికి స్వయాన బాబాయి అయిన హరినాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో వీరిద్దరూ కలిసి హరినాయుడికి వైద్యచికిత్సల నిమిత్తం తిరుపతిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని భావించారు.

### తన స్నేహితులతో కలిసి..

కానిస్టేబుల్ సునీల్‌నాయుడు ఈనెల 13న తన విధులకు సెలవు పెట్టాడు. ఆ తర్వాత తన స్నేహితులైన చాగలమర్రి మండలం కొత్తపల్లికి చెందిన బత్తూరు ధర్మారెడ్డి(27), బండి ఆత్మకూరు మండలం సోమరాజులపల్లికి చెందిన వినోద్ (29) (వీరిద్దరూ నంద్యాలలోని ఓ ప్రైవేట్ కంపెనీలో) ఉద్యోగం చేస్తున్నారు. తన చిన్నాన్న ఆరోగ్య విషయం సునీల్ వారితో చర్చించాడు. ఆ తర్వాత ఈ నలుగురు కలిసి హరినాయుడిని తీసుకొని ఈ నెల 13న కారులో నంద్యాల నుంచి తిరుపతికి వెళ్లి అతడిని అక్కడ ఆస్పత్రిలో చేర్పించారు.

### తిరుగు ప్రయాణంలో ప్రమాదం..

హరినాయుడిని అక్కడ వదిలి.. వీరందరూ అదే వాహనంలో సోమవారం నంద్యాలకు బయలుదేరారు. కడప జిల్లాలోని ఒంటిమిట్ట మండలం నడింపల్లి వద్దకు రాగానే.. ఎదురుగా వస్తున్న.. పోలీసు పెట్రోలింగ్ వాహనంతో పాటు కడప- తిరుపతి బస్సును కూడా ఢీకొట్టడంతో వీరు ప్రయాణిస్తున్న స్కార్పియో నుజ్జునుజ్జైంది. దీంతో అక్కడికక్కడ తేజనాయుడు, వినోద్, బత్తూరు ధర్మారెడ్డి మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ సునీల్‌నాయుడిని వైద్య చికిత్సల నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే కానిస్టేబుల్ పరిస్థితి కూడా విషమంగా ఉందని సమాచారం.

### ఆ కుటుంబాల్లో విషాదం

ఈ ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురితో పాటు గాయపడిన కానిస్టేబుల్ సైతం అందరూ స్నేహితులే కావడంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మృతి చెందిన వారికి ఏ కుటుంబాన్ని కదలించిన కన్నీరుమున్నీరవుతున్నారు. ఐటీఐ చదువుతున్న తేజనాయుడు తమ చిన్నాన్న ఆరోగ్యం కోసం వెళ్లి ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు భద్ర, రాజేశ్వరి బోరమని విలపించారు. ఒక్క కుమారుడు దూరం కావడంతో వారు బాధ వర్ణనాతీతం. బత్తూరి ధర్మారెడ్డి మృతి విషయం తెలియగానే.. బాధిత తల్లిదండ్రులు బత్తూరు శివ శంకర్‌రెడ్డి, అరుణమ్మ హుటాహుటిన కడప కు బయలుదేరారు. ధర్మారెడ్డి మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకు న్నాయి. మృతుల్లో మరోకరైన వినోద్ చిన్నతనం నుంచే.. తాత అవ్వలు, మేనమామల) వద్ద ఉంటూ చదువు కున్నాడు. ప్రస్తుతం జియో కంపెనీ లో పనిచే స్తున్నాడు. ఈ రోడ్డు ప్రమాదంలో వినోద్ మృతి చెందా డ నే విషయం తెలియగానే.. ఇంటి వద్ద అవ్వ, తాతలతో పాటు బంధు వుల రోదనలు మిన్నంటాయి. ఇదే ఘటనలో కానిస్టేబుల్ సునీల్‌నాయుడు తీవ్ర గాయపడి ప్రాణాలతో బయట పడ టంతో బాధిత కుటుంబ ఊపిరి పీల్చుకున్నట్లైంది.

# మత విద్వేషాలు రెచ్చగొడుతున్న భూమన

- ఆవులు చనిపోతున్నాయని అవాస్తవ ప్రచారం
- అధునాతన పద్ధతులతో గోవుల సంరక్షణ
- న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



నంద్యాల రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కరుణాకర్‌రెడ్డి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో వేంకటేశ్వర స్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకర్‌రెడ్డి మరోసారి దుష్ప్రచారానికి తెరలేపారన్నారు. గోశాలలో రోజుకు వంద ఆవులు చనిపోతున్నాయంటూ కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కరుణాకర్‌రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి చనిపోయినట్లు చూపించిన ఆవుల ఫొటోలు ఇక్కడివి కాదని ఎక్కడివో చూపిస్తూ టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. టీటీడీ గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవుల సంరక్షణ సక్రమంగా చూసుకుంటుంటే పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేయటం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. గోశాలలోని 2668 ఆవులకు జియోట్యాగ్ చేసి పర్యవేక్షిస్తుంటే జియోట్యాగ్ తీసేశారంటూ విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అధునాతన సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిరోజు శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు.

# నేడు భ్రామరికి కుంభోత్సవం



కుంభోత్సవానికి ముస్తాబైన అమ్మవారి ఆలయం

శ్రీశైలం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం భ్రమరాంబికాదేవి అమ్మవారికి వార్షిక కుంభోత్సవం కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. కుంభోత్సవానికి ఏర్పాట్లను దేవస్థానం ఇప్పటికే పూర్తి చేసింది. అమ్మవారికి ఉత్సవ సంబంధ కార్యక్రమాలు సంపూర్ణంగా జరిపించాలని ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు అర్చకులకు, అధికారులకు సూచనలిచ్చారు. కుంభోత్సవం వేడుక అనంతరం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని, క్యూలైన్లలో తొక్కిసలాట జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దేవస్థానం భద్రత విభాగపు పర్యవేక్షకులను ఆదేశించారు. మంగళవారం జరుగనున్న కుంభోత్సవం సందర్భంగా శ్రీశైలం సీఐ జి. ప్రసాదరావు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

**ఆది దంపతులకు వెండి రథోత్సవం:** శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు.

# నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

## పైపులైన్‌కు ప్రత్యామ్నాయం చూపండి

● ఎమ్మెల్యేకు జేఏసీ నాయకుల వినతి

నందికొట్కూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లుకు పట్టణంలో తీసుకెళ్తున్న పైప్‌లైన్‌ను వెంటనే రద్దు చేయాలని జేఏసీ నాయకులు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం డా.బి.ఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేకు జేఏసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో పైప్‌లైన్ వెళ్తే తాగునీటి పైప్‌లైన్, టెలిఫోన్ లైన్, డ్రైనేజీ వ్యవస్థకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. రోడ్డును తవ్వి పైప్‌లైన్ వేసిన తర్వాత సంవత్సరం పాటు పైప్‌లైన్ లీకేజీ తదితర వాటి పరిశీలన కోసం రోడ్డు నిర్మాణం చెయ్యరని దీని ద్వారా ప్రజలు ఇబ్బందుకు గురి కావాల్సి వస్తోందని జేఏసీ నాయకులు నాగేశ్వరరావు, కౌన్సిలర్ చాంద్‌బాషా ఎమ్మెల్యేకు వివరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జేఏసీ నాయకులు చాంద్‌బాష, నాగేశ్వరరావు, పక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా వుండాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్నఅగ్నిమాపక శాఖ సిబ్బంది

ఆత్మకూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి బీముడునాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఫైర్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు అగ్ని ప్రమాదాల వల్ల సంభవించే నష్టాలు, అనర్థాలను దృష్టిలో వుంచుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. కాగా ప్రతిఏటా అగ్నిమాపకశాఖ అధికారులు వారోత్సవాలను నిర్వహించి ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తోందని పేర్కొన్నారు. అనంతరం వారోత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

## బైర్లూటిలో దంచికొట్టిన వడగండ్ల వాన



ఆత్మకూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో బైర్లూటి ముర్తుజావలి దర్గా వద్ద సోమవారం వడగండ్ల వాన దంచికొట్టింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉన్నప్పటికీ ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది.

## రంగనాథస్వామికి పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న గౌరు వెంకటరెడ్డి, నాయకులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీరంగనాథస్వామి జాతర సందర్భంగా నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌరువెంకటరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు రమణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దొరబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పారువేట



అశ్వవాహనంపై స్వామివారిని పారువేటకు తీసుకెళ్తున్న భక్తులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పారువేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అశ్వవాహనాన్ని అలంకరించి స్వామివారిని ఆశీనులు చేసి పారువేటకు పంపించారు. వేట ముగించుకుని తిరిగి వచ్చే సమయంలో స్వామివారు గణవాహనంపై వస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

## వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ అహ్మద్‌హుసేన్

ఆత్మకూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు అన్యాయం చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ అహ్మద్‌హుసేన్ పేర్కొన్నారు సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ, రాజ్యసభలో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు ఆమోదం తెలపడం సరికాదని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును బలవంతంగా అమలు చేయడం అన్యాయమన్నారు.

**నందికొట్కూర:** బీజేపీ ప్రభుత్వం తీసుకున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి అన్నారు. సోమవారం నందికొట్కూరు కొత్తబస్టాండ్ నుంచి డా.బి.ఆర్ అంబేడ్కర్ సర్కిల్ వరకు ముస్లిం మైనార్టీలు, సీపీఎం నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అక్కడ డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మానవహారం చేపట్టి లబ్బివెంకటస్వామి దువా చేశారు. లబ్బివెంకటస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ముస్లి మైనార్టీల ఓట్లు కావాలే తప్పా.. వారి హక్కులు పట్టడం లేదన్నారు. వక్ఫ్‌బోర్డు అనేది ముస్లిం మైనార్టీల హక్కు అని అలాంటి వక్ఫ్ బోర్డు చట్టాన్ని సమరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైసీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు దౌలత్ బాషా ఎస్‌డీపీఐ. నాయకుడు ఖలీల్‌బాషా, అన్వర్, సీపీ ఎం నాయకులు నాగేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

**నంద్యాల రూరల్:** వక్ఫ్ బిల్లును కేంద్రం రద్దు చేయాలని నంద్యాల ముస్లిం జేఏసీ డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నంద్యాల గాంధీచౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ముస్లిం జేఏసీ నాయకులు అబులైస్, మౌలానా అబ్దుల్లా, అబ్దుల్ సమద్ మాట్లాడుతూ.. ఏపీ అసెంబ్లీలో ఈ బిల్లును అమలు చేయమని తీర్మానం చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మస్తాన్‌ఖాన్, బాషా, సమీర్ సీపీఐ నాయకులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి దువా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

## అంబేడ్కర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

● కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా.బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం డా.అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగాహాజరయ్యారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనం చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి చింతామణి, డీఎఫ్ఓ నాగ మునేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డీపీవో జమీవుల్లా, పరిశ్రమల జిల్లా మేనేజర్ జవహర్ బాబు, కౌన్సిలర్ అనూష, దళితసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నంద్యాల ఎడ్యుకేషన్ :** జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కేవీ శివయ్యల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు.

● పీఆర్‌టీయూ కార్యాలయంలో అధ్యక్షులు రామపక్కీరారెడ్డి ఆధ్వర్యంలో బండిఆత్మకూరు మండల విద్యాశాఖాధికారి మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కాగా, పీఆర్‌టీయూ నాయకులు కృష్ణారావు, చంద్రశేఖర్‌రెడ్డి, దేవనాలశ్రీనివాసులు, తిమ్మరాజు, పీ శ్రీనివాసులు అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ సభ్యులు సాంబశివుడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరిశ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్‌లు బత్తుల రవికుమార్, గోపాలరావు, జయరామ్ తదితరులు బొమ్మలసత్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడే జయంతి వేడుకలను నిర్వహించారు.

● నంద్యాల పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలఅకాడమీ పాఠశాలలో కరస్పాండెంట్ రవీంద్రనాద్, ప్రిన్సిపల్ మాధవీలత, బాలచంద్రా సమతా విద్యానికేత్ పాఠశాలలో కరస్పాండెంట్ బాలచంద్రుడు ఆధ్వర్యంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు.

**పాణ్యం :** మండలంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకులను ఘనంగా నిర్వహించారు. పాణ్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ ఉశేన్‌బీ, ఎంఈవో కోటయ్య, ఎంఏవో జయప్రకాష్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. మాలమహానాడు డివిజన్ నాయకులు దేవదత్తు, మాజీ సర్పంచ్ మద్దిలేటి ఆధ్వర్యంలో పాణ్యం గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి, మద్దూరు దళిత మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఎస్సీ హాస్టల్‌లో వార్డన్ సాగర్, ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దానం, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, రాంమోహన్‌నాయుడు, కృష్ణ, సుబ్బయ్య, ప్రభాకర్, కెజె శ్రీనివాసులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**నంద్యాల కల్చరల్:** నంద్యాలలో రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మల సత్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు

● భారత రాజ్యాంగ రూపశిల్పి భారతరత్న డా.బిఆర్ అంబేడ్కర్ అని నంద్యాల బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఇనుగూరి రమేష్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర బిజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాలమేరకు నంద్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు నేతృత్వంలో నంద్యాల బీజెపీ పార్లమెంట్ కార్యాలయంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు డా.బిఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసిఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కశెట్టి చంద్రశేకర్, మండల అధ్యక్షుడు గురుబ్రహ్మం, కార్యకర్తలు బాలముని పాల్గొన్నారు.

**వెలుగోడు:** అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పలు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు సోమవారం అంబేడ్కర్ 134 వ జయంతి పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాలలో ఎమ్మార్పీఎస్ నాయకులు, ఆరోగ్యం, భాస్కర్, జేఏసీ నాయకులు మౌలానా, జవాద్ అహమ్మద్, ఇదాయత్ అలీఖాన్, షబ్బీర్, రసూల్, జనసేన నాయకులు శాలు బాషా పాల్గొన్నారు.

**పాములపాడు:** పాములపాడులో దాదాసాహెబ్ అంబేడ్కర్ 134 జయంతి వేడుకలను ఘనంగా అధికారులు, పలు ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

**మిడుతూరు:** రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు మండలంలోని చౌట్కూరు, రోళ్లపాడు, బైరాపురం, వీపనగండ్ల, తలముడిపి మిడుతూరు తదితర గ్రామాలలో ఘనంగా జరిగాయి మండల కేంద్రం మిడుతూరులో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద , అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మిడుతూరు అంబేడ్కర్ భవనం వద్ద ఎస్ఐ ఓబులేసు, గ్రామస్తులు అంబేడ్కర్ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్వోత్తమ రెడ్డి, రామస్వామి రెడ్డి,మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

**జూపాడుబంగ్లా:** మండల కేంద్రం జూపాడుబంగ్లాలో నూతనంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం విగ్రహాన్ని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరీశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రనివాసులు, రవికాంత్, దళితసంఘాల నాయకులు, మేధావులు, వామపక్షనాయకులు అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

**బండిఆత్మకూరు:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామాల సచివాలయాల్లో, దళిత వాడల్లో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

**ఆత్మకూరు:** ఆత్మకూరు పట్టణంలో సోమవారం బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, అర్బన్ సీఐ రాము, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, టీడీపీ మండల అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, ఆయా ప్రజా సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● ఆత్మకూరులోని కిషన్‌సింగ్ వీధిలోని బాలికల హాస్టల్‌లో సోమవారం బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, ఏఎస్‌డబ్ల్యుఓ అంకన్న, డిప్యూటీ తహసీల్దార్ అంజనేయులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● ఆత్మకూరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం రాజ్యాంగ రూపకర్త బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంబేడ్కర్ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఎం కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు రణధీర్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

**నందికొట్కూరు:** నందికొట్కూరులోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి సోమవారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో బి.ఆర్.అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, మున్సిపల్ కమీషనర్ బేబి,నందికొట్కూరు రూరల్ సి.ఐ. సుబ్రహ్మణ్యం, నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరమ్మ, టీడీపీ నాయకులు వేణుగోపాల్, ఆర్జు శ్రీనివాసులు, డా.వనజ, తమ్మెడపల్లి ఏసేపు, సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మున్సిపాల్టీలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డా.కాకరవాడ చిన్నవెంకటస్వామి, నాగేశ్వరరావు, చాంద్‌బాష ,లాలుప్రసాద్, సత్యనారాయణ, మున్సిపల్ కమీషనర్ బేబి పాల్గొన్నారు.

● మాలమహానాడు ఆధ్వర్యంలో పట్టణంలోని కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు.

● వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డా.ధార సుధీర్ డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మన్సూర్ అహ్మద్, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు, వైసీపీన ఆయకులు కోకిల రమణారెడ్డి, మార్కెట్ రాజు, జడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, వేగా ఫౌండేషన్ అధ్యక్షులు బోరెల్లి వెంకటరాముడులు అన్నారు. సోమవారం వేగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని 10 బొల్లవరం గ్రామంలో డా.బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, బక్కన్న, నాగరాజు, శేషన్న, తదితరులు పాలొగన్నారు.

**నందికొట్కూరు రూరల్:** మండలంలోని దామగట్ల సర్పంచ్ మాదవరం శుసీలమ్మ, ఎంపీటీసీ తిప్పిరెడ్డి, టీడీపీ నాయకులు మాదవరం ఏసురత్నం అంబేద్కర్ 134 వజయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు , చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**గడివేముల:** మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిలకలగూడూరు గ్రామంలో టీడీపీ నాయకులు రఫిక్, సుదర్శన్‌రెడ్డి, జనసేన నాయకుడు వెంకటేశ్వర్లు, గడివేములలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

**మహానంది:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మహానంది మండల టీడీపీ నాయకులు క్రాంతికుమార్ యాదవ్, గని చిన్న రంగస్వామిలు తెలిపారు. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు వివిధ పార్టీల నాయకులు, మేధావులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**నంద్యాల హాస్పిటల్:** రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా బొమ్మలసత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దండె నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్‌నాయుడు, నాగరాజు, పుల్లయ్య, దక్షిణామూర్తి, మల్లికార్జున, మోహన్, మణికంఠ పాల్గొన్నారు.

**కొత్తపల్లి:** బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డా.బీఆర్ అంబేడ్కర్ అని కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మధు, సీపీఐ మండల కన్వీనర్ వెంకటశివుడు, సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నక్క స్వాములు అన్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని కొత్తపల్లిలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**సున్నిపెంట:** శ్రీశైలం మండలంలో సోమవారం అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం మండల బీజేపీ అధ్యక్షులు చదువుల శ్రీను ఆధ్వర్యంలో సున్నిపెంట బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సున్నిపెంటలోని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బస్టాండ్ లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు గిల్లి వెంటేశ్వర్లు, సోమిశెట్టి వెంటేశ్వర్లు, ఆశీర్వాదం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి



బండిఆత్మకూరు: ఎ.కోడూరులో..



జూపాడుబంగ్లాలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య



నంద్యాలలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..



పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో...



పాములపాడులో...



నంద్యాలలోని బీజేపీ కార్యాలయంలో...



గడివేములలో...



ఆత్మకూరులో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

## రైతుల జాతరగా తర్తూరు: ఎమ్మెల్యే



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తర్తూరు జాతర రైతుల జాతరగా పేరొందిందని ఎ మ్మెల్యే జయసూర్య అన్నారు. మండలంలోని తర్తూరు గ్రామంలో సోమవారం పాలపండ్ల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన వరలక్ష్మీ రైతుకు చెందిన వృషభాలు ప్రథమస్థానంలో నిలిచి రూ.40వేలు కైవసం చేసుకున్నారు. నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన నారాయణరెడ్డికి చెందిన వృషభాలు ద్వితీయస్థానంలో నిలిచి రూ.30వేలు, నంద్యాల జిల్లా చిన్నకానాల గ్రామానికి చెందిన చెన్నారెడ్డి వృషభాలు తృతీయస్థానంలో నిలిచి రూ. 20వేలు గెలుచుకున్నారు. నంద్యాల జిల్లా కొణిదేల గ్రామానికి చెందిన దండు రైడర్స్ వృషభాలు రూ.15వేలు, నంద్యాల జిల్లా మండ్లెం గ్రామానికి చెందిన మహబూబ్‌బాషాకు చెందిన వృషబాలు ఐదవస్థానంలో నిలిచి రూ.10వేలు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు వెంకటేశ్వర్లుయాదవ్, రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి, దొరబాబురెడ్డి, శ్రీనివాసులు, రవికాంత్ ఆలయచైర్మన్ నారాయణరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్‌ప్రసాదరెడి పాల్గొన్నారు.

### 'అసత్య ప్రచారాలు మానుకోవాలి'

నందికొట్కూరు రూరల్ : తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన 100కు పైగా గోవులు చనిపోయాయని మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరెడ్డి అసత్యప్రచారాలు చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం తగదని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు.సోమవారం మండలంలోని అల్లూరు గ్రామంలో ఆయన మాట్లాడుతూ వేల సంఖ్యలో ఉన్న గోవులలో నెలకు దాదాపుగా 15 దాకా మరణించడం మూడు నెలలో 45 గోవులు మరణించి వుంటాయని అన్నారు. వీటికి రికార్డులు కూడా ఉన్నాయని, వెళ్లి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, రాష్ట్ర యాదవ సంఘం కార్పోరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

## టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే బుడ్డా




వెలుగోడులో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వెలుగోడు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన వెలుగోడు పట్టణంలో రూ.77.60 లక్షలతో నిర్మించిన 12 రోడ్లను, మాదవరం గ్రామంలో రూ. 30 లక్షలతో నిర్మించిన నాలుగు రోడ్లను, కేజీబీవీ ప్రహరీ గోడను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో గాడి తప్పిన పాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గాడిలో పెడుతున్నారని, ఆర్థిక నష్టాలలో కూరుక పోయిన రాష్ట్రాన్ని చంద్రబాబు గాడిలో పెడుతున్నారని తెలిపారు. కూటమి పాలనతో ప్రజలకు దశల వారిగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, శేషిరెడ్డి, అబ్దుల్‌కలాం, ఖలీల్, జాకీర్‌హుస్సేన్, రసూల్, హిదాయత్, వజీర్, పాలశంకరరెడ్డి, సుదాకరరెడ్డి, రామనాయుడు, భూపాల్‌చౌదరి, జనసేన నాయకులు శాలుబాషా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మహానందిలో భక్తుల రద్దీ



మహానంది ఆలయంలో భక్తుల రద్దీ

మహానంది, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వరుస సెలవులు రావడంతో మహానంది క్షేత్రం వేలాదిమంది భక్తుల రద్దీతో నిండిపోయింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి గత రెండు రోజులుగా వివిధ వాహనాల ద్వారా దైవదర్శనం కోసం వేలాదిమంది భక్తులు తరలి రావడం జరిగింది. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల శివనామ స్మరణతో మారుమోగింది. రుద్రగుండం కోనేరుతో పాటు రెండో ప్రాకారంలోని పూల కోనేర్లల్లో పుణ్య స్నానాలు ఆచరించి మహానందీశ్వరునికి,కామేశ్వరీదేవి అమ్మవార్లకు కాయ కర్పూరాలు సమర్పించారు. ఆలయ ఏఈఓ యర్రమల్ల మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య సుబ్బారెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు చేపట్టారు. కాగా సోమవారం రాత్రి ఆలయంలో పల్లకి సేవ ఉత్సవంను ఆలయ వేదపండితులు భక్తుల సమక్షంలో నిర్వహించారు.

### వ్యాన్ బోల్తా



బండిఆత్మకూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని సంతజూటూరు గ్రామం సమీపాన టమోటాల వ్యాన్ బోల్తా పడింది. సోమవారం నంద్యాల నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న టమోటాల వ్యాన్ నడిరోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. తృటిలో ప్రమాదం తప్పిపోయింది. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

## యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్, వేగా ఫౌండేషన్ అధ్యక్షుడు

నందికొట్కూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్.అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, వేగా ఫౌండేషన్ అధ్యక్షులు బోరెల్లి వెంకటరాముడులు అన్నారు. సోమవారం వేగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 బొల్లవరం గ్రామంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, బక్కన్న, నాగరాజు, శేషన్న పాలొగన్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

**మహానంది, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మహానంది సమీపంలోని అరటి తోటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలో సోమవారం ఉదయం అరటి తోటలో పొగలు వ్యాపించడంతో సమీపంలో పనులు చేస్తున్న కూలీలు అక్కడికి వెళ్లి చూశారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంటల్లో కాలిపోతున్నట్లుగా గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మహానంది పోలీసులతో పాటు నంద్యాల సీఐ శ్రీనివాసరెడ్డి, మహానంది, బండిఆత్మకూర్ ఎస్ఐలు రామ్మోహన్‌రెడ్డి, జగన్ మోహన్ ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అప్పటికే మృతదేహం పూర్తిగా కాలిపోయింది. అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇది హత్యనా..? ఆత్మహత్యనా అన్నది తెలియాల్సి ఉంది. మహానంది పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వడదెబ్బతో ఉపాధి కూలీ..


లక్ష్మన్న (ఫైల్)

**పత్తికొండ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి):** మండలంలోని హోసూరు గ్రామానికి చెందిన అడవి లక్ష్మన్న (55) సోమవారం వడదెబ్బతో మృతిచెం దారు. ఉదయం కూలీలతో పాటు ఉపాధి పనులకు వెళ్లారు. పనులు ముగి సిన తర్వాత ఇంటికి వచ్చి నిద్రకు ఉపక్రమించారు. అయితే మధ్యాహ్నం వాంతులు చేసుకున్నారు. తీవ్ర అస్వస్థతకు ఇంటి వద్దే మృతి చెందారు. అధికారులు గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు.

## విద్యుదాఘాతంతో రైతు..

**డోన్ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని కామగానిగుంట్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు వడ్డె రమేష్ తనకున్న ఎకరా పొలంలో నీరు పారించేందుకు మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామ సర్పంచ్ రాధమ్మ, గ్రామ పెద్దలు వేమారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి..

**శిరివెళ్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి):** బైక్ అదుపు వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గుంప్రమాన్‌దిన్నెలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు. వివరాలు. గుంప్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన వరికూటి రేణుకేశ్వర రెడ్డి (37) అనే యువకుడు ఆదివారం రాత్రి యర్రగుంట్ల గ్రామంలో పనులు ముగించు కొని బైక్‌పై స్వగ్రామమైన గుంప్రమాన్‌దిన్నెకు తిరిగి వెళ్తున్నాడు. బైక్ అదుపుతప్పి అక్కడికక్కడే మరణించాడు. ఉదయం అటుగా వెళ్తున్నవారు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు రేణుకేశ్వరరెడ్డి ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి వరికూటి గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి..


రిషికుమార్(ఫైల్)

**వెల్దుర్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి):** పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో విద్యార్థి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వెల్దుర్తి ఐ.జీ.నగర్‌లో నివాసం ఉంటున్న రమేశ్, సుజాతకు రిషికుమార్, విక్కీ సంతానం. రిషికుమార్(14) క్రిష్ణగిరి ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సెలవు కావడంతో తల్లిదండ్రులకు తెలియకుండా అన్నదమ్ములు బైక్ తీసుకెళ్లారు. జాతీయ రహదారి-44పై నార్లాపురం స్టేజీ దాటాక వేగంగా లారీని ఢీ కొట్టడంతో బైక్ నడుపుతున్న రిషికుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గాయపడిన విక్కీని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బైకులు ఢీకొని యువకుడి దుర్మరణం


అజయ్‌కుమార్ (ఫైల్)

**జూపాడుబంగ్లా, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదివారం మిడుతూరు మండలం కడుమూరుకు చెందిన అజయ్‌కుమార్ తర్తూరు జాతరకు బైక్‌పై వెళ్తున్నాడు. నందికొట్కూర్‌కు చెందిన ముర్తుజావలి జాతర చూసుకొని తన మోటార్ సైకిల్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. వీరి వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ముర్తుజావలికి చేయి విరిగింది. అజయ్‌కుమార్ (21) కింద పడి స్పృహకోల్పోయాడు. నందికొ ట్కూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అనిల్ (ఫైల్)

**చాగలమర్రి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం కుప్పపైకి బైక్‌ను తీసుకెళ్లగా అదుపుతప్పి బోల్తాపడి సోమవారం యువకుడు మృతిచెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వివరాలు.. మండలంలోని ముత్యాల పాడు -గొడిగెనూరు గ్రామాల సమీపంలో రోడ్డుపై ధాన్యం ఆరబెట్టారు. బైక్ వెళ్తున్న అనిల్ కుమార్(31) ధాన్యం కుప్పలోకి బైక్‌ను తీసుకెళ్లాడు. అదుపుతప్పి బోల్తాపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన 108లో స్థానిక కేరళ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉద్యోగం దొరకదేమోనని..

- ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** ఉన్న ఉద్యోగం పోగా, ఆరు నెలలుగా ఖాళీ ఉంటూ మళ్లీ ఉద్యోగం దొరకదేమోనని మనస్థాపం చెందిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన మండలంలోని తిమ్మనాయినిపేటలో సోమవారం చోటుచేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు. గ్రామానికి చెందిన పసల పాపన్న కుమారుడు పసల జయకృష్ణ(23) బెంగుళూరులో ఉద్యోగం చేస్తూ ఉండేవాడు. ఆరునెలల క్రితం జాబ్ పోయింది. ఇంట్లోనే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు. ఇక తనకు ఉద్యోగం దొరకదని మనస్థాపం చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి పాపన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కనకాద్రి పల్లెకి చెందిన శ్రీవిద్య అనే వివాహితను భర్త, అత్త మామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీవిద్యకు పవన్‌కుమార్‌తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. కొన్నాళ్లు వీరి కాపురం సవ్యంగా సాగింది. కొంత కాలంగా అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్తమామలు వేధించ సాగారు. నాలుగు నెలల క్రితం అదనపు కట్నం తెచ్చేదాకా రావద్దంటూ ఇంట్లో నుంచి గెంటేశారు. అప్పటి నుంచి శ్రీవిద్య పుట్టింట్లో ఉంటుంది. వారిలో మార్పు రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## పార్థసారథి నగర్‌లో చోరీ

**కర్నూలు క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్థసారధి నగర్‌లో ఇంట్లో చోరీ జరిగింది. రాంగోపాల్ అనే వ్యక్తి ఇంట్లో ఆరున్నతర తులాల బంగారు నగలు, 50తులాల వెండి నగలు చోరీకి గురయ్యాయి. రాంగోపాల్ ఈనెల 12న కుటుంబ సభ్యులతో కలిసి ఊరెళ్లాడు. తిరిగి సోమవారం ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో ఉన్న నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారమివ్వడంతో వారు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# కార్పొరేట్ హాస్పిటళ్లకు సమానంగా సౌకర్యాలు


మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- ఆసుపత్రిలో సేవలన్నీ కంప్యూటరైజ్డ్
- డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో పరీక్షల నివేదికలు త్వరగా ఇవ్వాలి
- మరిన్ని క్యాంటీన్లు, జీవనాధార కేంద్రాల ఏర్పాటు
- 20 నెలల తర్వాత జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

**కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కార్పొరేట్‌కు దీటుగా రోగులకు భరోసా కల్పించేలా మెరుగైన వైద్యం, సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం కలెక్టర్ పి.రంజిత్ బాషా అధ్యక్షతన జరిగింది. మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ డా.కె.చిట్టి నరసమ్మ హాజరయ్యారు.

- మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇంకా ఇండెంట్స్ మాన్యువల్‌లో ఉంటున్నాయని, ఏదీ కూడా ఆఫ్‌లైన్‌లో ఉండకూడదని వచ్చే సెప్టెంబరులోపు రోగులకు అందించే అన్ని సేవలు ఆన్‌లైన్‌లో కంప్యూటరైజ్డ్ చేయాలని ఆదేశించారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో పార్కింగ్ ఎందుకుచేయలేక పోతున్నారని మంత్రి మండిపడ్డారు. లిఫ్టులు, జనరేటర్ల పనులన్నీ సీఎంసీ కిందకు తీసుకురావాలని మంత్రి సూచించారు. ఏ పరికరాలైన సీఎంసీ కింద ఉండే విదంగా కొటేషన్ తీసుకోవాలన్నారు.
- ఆసుపత్రిలో 24 గంటలు కరెంటు ఉండేలా కరెంటు పోయిన వెంటనే వచ్చే విదంగా ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.
- పందుల సంచారం ఎక్కువగా ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని, పందుల పెంపకందారులను పిలిపి పోలీసులు మాట్లాడాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అధికారులకు సూచించారు.
- ఆసుపత్రిలో మరికొన్ని క్యాంటీన్లు జీవనధార షాపులను రోగులకు అనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రికి ఓపీ ల్యాడ్స్ నిధులతో అంబులెన్సులు ఇస్తామని హామీ ఇచ్చారు.

### ఆమోదించిన తీర్మానాలు

- కొత్త సిటీ స్కాన్ కోసం ఎంఎస్‌వో/ ఎఫ్ఎన్‌వో, ఇతర సిబ్బంది నియమించేందుకు నివేదికలు ఇవ్వాలి.
- ఆసుపత్రిలో రోగుల సంఖ్యను బట్టి మరిన్ని జీవనాధార, క్యాంటీన్లు ఏర్పాటు
- ప్రధాన ద్వారం ఇన్‌గేటు ఏర్పాటుకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి కమిటీ ఏర్పాటు.
- ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు నిర్వహించే సివిల్ పనులు వేగవంతం చేయాలని, క్యాజువాల్టీ బాత్‌రూమ్‌లు, ఇతర విభాగల్లో డ్రైనేజీ లైన్లను ఎస్‌టీపీకి అనుబంధించడం సూపర్ స్పెషాలిటీ ఓపీ కౌంటర్లను త్వరగా నిర్మాణాలు చేపట్టాలి.
- మార్చురీలో ఆరు బాడీ ఫ్రీజర్లను హెచ్‌డీఎస్, సీడీఎస్ నిధుల కింద కొనుగోలు చేయాలి.
- కంప్యూటరైజ్ చేయాలి
- ఐపీడీ బ్లాక్ నిధులను తెప్పించడానికి కృషి చేయాలని తీర్మానం చేశారు.

### నిర్ధారణ పరీక్షల రిపోర్టులు త్వరగా ఇవ్వాలి : గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే



న్యూ డయాగ్నోస్టిక్ బ్లాకులో రోగ నిర్ధారణ పరీక్షలు నివేదికలు ఆలస్యం అవుతున్నాయని, రోగులకు రిపోర్టులు త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి సూచించారు. ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షల వివరాలు రిపోర్టులను ఇస్తే వైద్యం త్వరగా అందుతుందని, వీలతై వాట్సాప్ మెసేజ్ ద్వారా రిపోర్టులు ఇవ్వాలని కోరారు. మార్చురీలో సౌకర్యాలు కల్పిం చాలని శానిటేషన్, సెక్యూరిటీ సేవలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డా.బి.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ, డీసీహెచ్ఎస్ డా.శ్రీనివాసులు, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, హెచ్‌డీఎస్ సభ్యులు భైసాని పద్మజ, బోయ రామాంజనేయులు, సాయిప్రదీప్, రంగనాథరెడ్డి, డా.ప్రవీణ్ పాల్గొన్నారు.

### మరిన్ని ట్రాలీలు, వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలి : బొగ్గుల దస్తగిరి, కోడుమూరు ఎమ్మెల్యే



రోగుల పరీక్షల కోసం అవస్థలు పడుతున్నారని, వీల్ చైర్లు ట్రాలీలను అదనంగా ఏర్పాటు చేయాలని కోడుమురు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కోరారు. ఐసీయూలో ఫ్లోరింగ్ సరిగ్గా లేదని సిటీ స్కాన్ వద్ద రద్దీ ఉందని, అదనంగా ఏర్పాటు చేయాలని కోరారు.

అడిషినల్ డీఎంఈ డా. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫోరెన్సిక్ విభాగంలోని ఎలక్ట్రిషన్ పనులు పునరుద్ధరించాలని, హెచ్‌డీఎస్ నిధులతో మూడు, సీడీఎస్ నిధులతో మూడు, బాడీ ఫ్రీజర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

### సమావేశం స్థలం మార్పు ఎందుకో..?

- మధ్యాహ్నం తరువాత కలెక్టరేట్‌కు వేదిక మార్పు

కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహణ స్థలం మారింది. సోమవారం మధ్యాహ్నం 1 గంట వరకు హెచ్‌డీఎస్ సమావేశం జీజీహెచ్‌లోని ధన్వంతరీ హాలులో నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతూవచ్చారు. గతంలో కూడా ఆసుపత్రిలోనే హెచ్‌డీఎస్ సమావేశం జరిగింది. హెచ్‌డీఎస్ సమావేశం కోసం అధికారులు ధన్వంతరీ హాలులో అన్ని ఏర్పాట్లు చేశారు. అక్కడ జనరేటర్ సౌకర్యం కూడా కల్పించారు. అయితే సోమవారం ఉన్న ఫళంగా మధ్యాహ్నం హెచ్‌డీఎస్ సమావేశం వేదికను కలెక్టరేట్‌కు మార్చడంపై చర్చ జరుగుతోంది. ఆసుపత్రిలో సమావేశం నిర్వహిస్తే వాడివేడిగా చర్చ జరుగుతుంది. కలెక్టరేట్‌లో నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సమావేశాన్ని విలేకరులు లేకుండా నిర్వహించడం వెనుక మతలబు ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

## సమానత్వం ఇచ్చిన అంబేడ్కర్


అంబేడ్కర్ చిత్రపటానికి సెట్యూట్ చేస్తున్న ఎస్పీ

**నంద్యాల టౌన్ ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** రాజ్యాంగం ద్వారా అందరికి సమానత్వం కల్పించిన వ్యక్తి అంబేడ్కర్ అని ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేధావిగా, సంఘ సంస్కర్తగా దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

**నంద్యాల టౌన్ ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** ఈనెల 14 నుంచి 20వ తేది వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి యోగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..1944లో నౌకకు జరిగిన అగ్నిప్రమాదంలో బొంబాయి ఫైర్ సర్వీసు చెందిన 66 మంది, ప్రజలు 231 మంది చనిపోయారని వారి స్మారకార్థం దేశ ప్రభుత్వం ఈ వారోత్సవాలు నిర్వహిస్తుందని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య మంత్రి పర్యటనకు ఏర్పాట్లు

- అకాడమిక్ డీఎంఈ డా. వెంకటేశ్వర్లు

**కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** ఈ నెల 19వ తేదీ కర్నూలు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి వస్తున్న వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పర్యటనకు ఏర్పాట్లు చేయాలని అకాడమిక్ డీఎంఈ డా.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్, కర్నూలు మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌ను సందర్శించారు. అనంతరం మెడికల్ కాలేజీ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. అత్యవసరమైన వసతులు పరికరాలు సమస్యల నివేదిక తయారు చేసుకోవాలన్నారు. సమీక్షలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టి నరసమ్మ, సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, సీఎస్ఆర్ఎంవో డా.బి.వెంకటేశ్వరరావు హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్ల అరెస్ట్


నిందితులను చూపుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

**నంద్యాల టౌన్ ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** పలు గొలుసు దొంగతనం కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న దూదేకుల షహీద్ వలి, పింజరి దస్తగిరిలను నంద్యాల పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌వద్ద ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వివరాలు తెలిపారు. వీరి వద్ద నుంచి 4 తులాల తాళిబొట్టు బంగారు గొలుసు, 2.3 బంగారు గొలుసు, హోండా షైన్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు గతంలో కూడా పలు గొలుసు దొంగతనం కేసుల్లో ఉన్నారని జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు తెలిపారు. సీఐ సుధాకర్‌రెడ్డి, సురేశ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అయ్యో పాపం

- నవజాత శిశువు మృతదేహం

**నంద్యాల టౌన్ ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల పట్టణంలోని శ్రమదానం బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం నవజాత శిశువు శవాన్ని చెత్తలో పడేసి వెళ్లిపోయారు. ఆడ శిశువు మృతదేహాన్ని అట్ట పెట్టెలో పెట్టి చెత్తలో పడేశారని స్థానికులు నంద్యాల రెండో పట్టణ సీఐ ఇస్మాయిల్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించి, మున్సిపల్ వారికి అప్పజెప్పడంతో వారు పాప మృతదేహాన్ని తీసుకుని వెళ్లి ఖననం చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నిందితుడి అరెస్టు

**నంద్యాల టౌన్ ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల, గుంటూరు జిల్లాల్లో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగిన దోపిడీలు, బందిపోటు దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్న మేకల హనుమంతును అరెస్టు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రెండు జిల్లాలో పలు దొంగతనాలు, దారి దోపిడీ కేసుల్లో నిందితుడైన హనుమంతు పాములపాడు మండలం వేంపేంట గ్రామం జగన్ కాలనీలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. సోమవారం పాణ్యం వద్ద జంబులమ్మ ఆర్చీ గుడి వద్ద అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 5 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఐలు కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్‌కుమార్, ఎస్సై నరేంద్ర కుమార్‌రెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బాలుడిని కబళించిన నీటిగుంత

- నంద్యాల పార్కులో విషాదం

**నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** పార్కులో ఆడుకుంటున్న బాలుడికి నీటిగుంత మృత్యువు రూపంలో కబళించింది. అన్న కళ్లముందే తమ్ముడు మృత్యుఒడికి చేరిన హృదయ విదారక ఘటన సోమవారం నంద్యాల పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మున్సిపల్ హైస్కూల్ పక్కన ఉన్న పార్కులో అన్నదమ్ములిద్దరూ ఆడుకుంటూ నీరు నిల్వ ఉన్న గుంతలో పడ్డారు. దాదాపు 7అడుగుల గుంతలో నీరు ఉండటంతో అన్న అలీ ఇతరుల సాయంతో బయటపడగా, తమ్ముడు అయాన్(7) గుంతలో ఇరుక్కుని మరణించాడు. చాంద్‌బాడకు చెందిన మన్సూర్, రజియాలకు ఇద్దరు కుమారులు. ఇరువురు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. సోమవారం సాయంత్రం పార్కుకు వెళ్లి ఆడుకుంటూ మరణించడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. పోస్టుమార్టం గదివద్ద కుటుంబసభ్యుల రోదన పలువురిని కలచివేసింది.


బాలుడి మృతికి కారణమైన గుంత ఇదే

### రక్షణ కవచాలు ఏర్పాటు చేయకపోవడంతో...

పట్టణంలోని మున్సిపల్‌పార్కులో ఫిల్టర్‌బెడ్ కోసం చేపట్టిన నిర్మాణంలో భాగంగా దాదాపు 7అడుగుల గుంతలు తవ్వారు. ఇటీవల కురిసిన వర్షాలు, ఫిల్టర్‌బెడ్ క్యూరింగ్‌కోసం పోసిన నీటితో గుంత నిండిపోయింది. ప్రమాదకరమని తెలిసినా ఆ గుంతచుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటు చేయకపోవడం బాలుడి మృతికి కారణమని తెలుస్తోంది. పనులను పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ రక్షణ చర్యలు తీసుకోకపోవడంపట్ల పలువురు మండిపడుతున్నారు. ఈ పనులు దాదాపు 3నెలల నుంచి చేస్తున్నట్లు సమాచారం.

మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రారెడ్డి ఆస్పత్రిలో అయాన్ మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు ఉన్నారు.

# చిత్రజ్యోతి

SINCE 1965

## భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

## సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

## మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

## విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తీకేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

## పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

## జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

## తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచవ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

## బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

## ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

## వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

## ఐదుగురు పిల్లల తల్లికి అత్యుత్తమ మార్కులు

- ఆమె విద్యాకాంక్షే విజేతను చేసింది
- ఎన్నో అవమానాలు.. చీత్కారాలను అధిగమించి
- భార్యకు సహకరించి అందరి నోరు మూయించిన భర్త



**చదువు ఆమె జీవితాకాంక్ష. పదో తరగతిలో 357 మార్కులతో ఉర్దూ స్కూలు ఫస్టు వచ్చింది. కానీ ఇంటర్‌లో చేరలేకపోయింది. దగ్గరిలో ఉర్దూ జూనియర్ కాలేజీ లేకపోవడమే కారణం. ఇది 2007-08 నాటి మాట. ఆ తర్వాత పెళ్లయింది. ఐదుగురు పిల్లల తల్లి అయింది. అయినా చదువు మీద ధ్యాస పోలేదు. భర్త ఆమె ఆకాంక్షకు అక్షర రూపం ఇచ్చాడు. 34 ఏళ్ల వయసులో చంటి బిడ్డతో కాలేజీకి వెళ్లింది. ఈ ఏడాది ఇంటర్ రెండో సంవత్సరం అత్యుత్తమ మార్కులతో పాసైంది తబసుమ్.**



భర్త, పిల్లలతో తబసుమ్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల గ్రామానికి చెందిన షేక్ కేహెచ్ తబసుమ్‌కు బాగా చదువుకొని ఉద్యోగం చేయాలనే కోరిక ఉండేది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కోవెలకుంట్ల ఉర్దూ పాఠశాలలో చదివింది. 2007-08 సంవత్సరంలో పదో తరగతిలో 357 మార్కులతో స్కూల్ ఫస్ట్ వచ్చింది. దీంతో ఆమె చదవాలన్న కోరిక మరింత బలపడింది. అయితే పరిస్థితులు అనుకూలించలేదు. కోవెలకుంట్లలోగాని, ఆళ్లగడ్డ కాని, నంద్యాలలో కాని ఉర్దూ జూనియర్ కళాశాల లేదు. కర్నూలుకు పంపించి చదివించే ఆర్థిక స్థోమత తల్లిదండ్రులకు లేదు. దీంతో చదువు ఆగిపోయింది. 2010లో తబసుమ్‌ను ఆళ్లగడ్డ మండలం చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన మాబాషా అనే బైక్ మెకానిక్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆయన తబసుమ్ విద్యాకాంక్షను గుర్తించాడు. భార్యను చదివించడానికి ఉర్దూ కళాశాలల గురించి తెలిసిన వారందరినీ ఆరాతీశారు. కర్నూలు తప్ప మరెక్కడా ఉర్దూ కళాశాల లేదని చెప్పడంతో చేసేదేమి లేక ప్రయత్నం విరమించాడు. 2010 నుంచి 2023 వరకు స్వగ్రామంలోనే ఆ దంపతులు ఉండిపోయారు. వారికి ఐదుగురు పిల్లలు కలిగారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. అయినా మాబాషా తన భార్యను ఎలాగైనా చదివించి ఆమె ఆశయాన్ని నెరవేర్చాలనే సంకల్పంతో తెలిసిన వారందరినీ ఆరాతీస్తూనే ఉన్నాడు. ఓ రోజు నంద్యాలలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలను నెలకొల్పారనే సమాచారం చెవిన పడింది.

### భార్య చదువు కోసం..

తబసుమ్ 2023లో నంద్యాలలోని ఉర్దూ కళాశాలలో అడ్మిషన్ పొందడానికి మూడేళ్ల పిల్లాడితో కళాశాలకు వెళ్లింది. అక్కడున్న వారందరూ వ్యంగంగా చూశారు. కానీ ఆమె అవేమి పట్టించు కోలేదు. ప్రిన్సిపాల్ కరీముల్లా వద్దకు వెళ్లి అడ్మిషన్ ఇవ్వాలని పట్టుబట్టింది.. ప్రిన్సిపాల్ ఆర్ఐవో దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా ఆమెకు హెచ్ఎంసీ (ఉర్దూ) అడ్మిషన్‌ను ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆమె సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. చంటి పిల్లాడితో, కాలేజీ బ్యాగుతో ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు బస్సులో ఆమె కళాశాలకు వెళ్లడం చూసి కొందరు అవమానకరంగా మాట్లాడారు. ఈ వయసులో నీకు చదువెందుకు అని హేళన చేశారు. కళాశాలలో చేరిన రోజు చంటి పిల్లాడిని చూసి అధ్యాపకులు ఆశ్చర్యపోయారు. కాని ఆమె పట్టుదలను చూసి చలించి పిల్లాడిని వెంట తెచ్చుకోవడానికి అనుమతినిచ్చారు. అలా రెండు నెలలు గడిచాయి. భార్య పడుతున్న కష్టాలను చూసి మాబాషా తన స్వగ్రామం నుంచి మెకానికల్ సామగ్రితో సహా నంద్యాలకు చేరుకున్నాడు. అప్పుడు బంధువులు, తల్లిదండ్రులు ఎన్నో అభ్యంతరాలు వెలిబుచ్చారు. అయినా ఆయన పట్టుసడలలేదు. నంద్యాల పట్టణం ఎస్బీవోస్ కాలనీకి చేరుకొని ఒక చిన్న ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఇంటర్ మొదటి సంవత్సరంలో తబసుమ్ 500కు 438 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. ఇటీవల విడుదలైన ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కూడా 1000కి 876 మార్కులు సాధించి ఉర్దూ కాలేజీల్లో జిల్లా టాపర్‌గా నిలిచింది.



### ఐఏఎస్ చదవాలని ఉంది.. స్థోమత లేదు

చిన్నప్పటి నుంచి నాకు ఐఏఎస్ కావాలనే తపన ఉండేది. కానీ 10వ తరగతిలో చదువు ఆగిపోయింది. నా భర్త, ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సహకరించడంతో ఇంటర్‌లో మంచి మార్కులు సాధించాను. రెండు సంవత్సరాల పాటు పిల్లాడిని తీసుకుని వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలోనే ఉండేదాన్ని. నేను ప్రతిరోజు తెల్లవారుజామున 3గంటలకు లేచి 5 గంటల వరకు చదువుకొనేదాన్ని. తర్వాత నమాజు చేసుకుని పిల్లలను రెడీ చేసి స్కూలుల్లో వదిలేసేదాన్ని. 9గంటలకంతా చిన్న పిల్లాడిని చంకనేసుకుని కాలేజీకి వెళ్లేదాన్ని. సాయంత్రం ఐదు గంటలకు ఇంటికి వచ్చి ఏడు వరకు పిల్లలకు ట్యూషన్ చెప్పేదాన్ని. తర్వాత 9 నుంచి 11 వరకు మరోసారి చదువుకుని ఆ తర్వాత నిద్రపోయేదాన్ని. టీటీసీ చేసి, ఆ తర్వాత డిగ్రీ చేసి ఏదైనా ఉద్యోగం చేస్తూ ఐఏఎస్ కావాలనే ఆశయ సాధన కోసం నిరంతరం కృషిచేస్తాను.

- తబసుమ్


తబసుమ్



### ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాను

నా భార్య తబసుమ్‌కు చదవాలనే సంకల్పం గట్టిగా ఉండేది. ఎప్పుడు ఏది కావాలని అడిగినా చదివించమని కోరేది. కాని చుట్టు పక్కల ఉర్దూ కళాశాల లేకపోవడంతో 12 ఏళ్ల పాటు ఏమీ చేయలేకపోయాను. 2023లో ఆళ్లగడ్డ నుంచి కళాశాలకు వెళుతుంటే ప్రతి ఒక్కరూ నన్ను అనేక విధాలుగా అవమానించారు. బంధువులు, చుట్టుపక్కల వారు అవహేళన చేశారు. వారందరికీ బుద్ధి చెప్పేందుకు ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొని పిల్లలతో పాటు నా భార్యను కూడా చదివించాను. నేను చదువుకోలేదు. వారిలో చదువును చూసుకుంటున్నాను.

-మాబాషా



### ఆర్ఐవోతో పర్మిషన్ తీసుకుని అడ్మిషన్ ఇచ్చాం

తబసుమ్ పట్టువదలకుండా అడ్మిషన్ కావాలని అడగడంతో ఇంటర్‌లో అడ్మిషన్ ఇచ్చేందుకు ఆర్ఐవో మాట్లాడి ప్రత్యేక పర్మిషన్ తీసుకున్నాం. ఇంతటి ఊహించిన ఫలితాలను సాధిస్తుందని అనుకోలేదు. ఉర్దూ మీడియం విద్యార్థులకు ఇంగ్లీష్‌లో సాధారణంగా తక్కువ మార్కులు వస్తుంటాయి. కాని తబసుమ్‌కు రెండు సంవత్సరాల్లో 75, 80 శాతం మార్కులు వచ్చాయి. ఆర్థికంగా చేయూతనిస్తే ఆమె అనుకున్న ఆశయాన్ని తప్పకుండా సాధిస్తుంది.- కరీముల్లా, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల

## పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- గుంటూరు డీఆర్ఎం సుధేష్ణసేన్
- నంద్యాల రైల్వేస్టేషన్ తనిఖీ



నంద్యాల రైల్వేస్టేషన్ ఆవరణలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న గుంటూరు డీఆర్ఎం సుధేష్ణసేన్

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అమృత్‌భారత్ స్టేషన్స్ స్కీంకు ఎంపికైన నంద్యాల రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని గుంటూరు డివిజన్ రైల్వేమేనేజర్ సుధేష్ణసేన్ ఆదేశించారు. ఇటీవలే నూతనంగా డీఆర్ఎంగా బాధ్యతలు చేపట్టిన ఆమె అమృత్‌భారత్ స్టేషన్స్ పనులు ఏవిధంగా జరుగుతున్నాయో పరిశీలించేందుకు ఆమె సోమవారం గుంటూరు నుంచి బయల్దేరారు. మార్గమధ్యలో సాతులూరు, నరసరావుపేట, దొనకొండ, మార్కాపురం రైల్వే స్టేషన్ల పరిశీలన అనంతరం నంద్యాలకు చేరుకున్నారు. నంద్యాల రైల్వేస్టేషన్‌లోని రన్నింగ్‌రూమ్‌ను పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు. రన్నింగ్‌రూమ్ వెనుకవైపు నిర్మాణంలో ఉన్న ఆఫీసర్స్ గెస్ట్‌హౌస్ పనులను పరిశీలించారు. అక్కడినుంచి అంబేడ్కర్ భవన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రైల్వే స్టేషన్ ఆవరణలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులకు సంబంధించిన మ్యాప్‌ను సంబంధిత సీనియర్ సెక్షన్ ఇంజనీర్లను అడిగితెలుసుకున్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో నంద్యాల రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉండటంతో అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీలేకుండా సూచించిన సమయానికి పనులను పూర్తిచేసి సేవలను ప్రయాణికులకు అందించాలని చెప్పారు. డీఆర్ఎం రాకతో సీపీఎం నాయకులు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా స్టేషన్ ఎదురుగా ఉన్న వ్యాపార సముదాయాలను తొలగించడంతో వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలని కోరారు. ఆ ఆవరణలో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం ఉంటుందని తదనంతరం సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని ఆమె చెప్పారు. నంద్యాల నూనెపల్లె ఓవర్‌బ్రిడ్జి కింద ట్రాక్ దాటకుండా కడ్డీలు ఏర్పాటుచేశారని వాటిని తొలగిస్తే అవతలివైపు ఉన్న జాతీయ రహదారికి చేరుకునేందుకు మార్గం సుగమం అవుతుందని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అర్ధరాత్రి మందుబాబులు, అనుమానాస్పదవ్యక్తులు సంచరిస్తున్నారని, రాత్రిపూట విధులు నిర్వహించే రైల్వే సిబ్బందిపై దాడులకు పాల్పడుతుండటంతో కడ్డీలు వేశామన్నారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం కూడా పరిశీలనలో ఉందని ఆమె తెలిపారు. డీఆర్ఎం వెంట గుంటూరు రైల్వే డివిజన్ అధికారులు, నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్, పలు విభాగాల అధికారులు, ఇంజనీర్లు ఉన్నారు.

# డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

## సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా : సీఐ

**శిరివెళ్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) :** శిరివెళ్ల పోలీస్ సర్కిల్ పరిధిలోని శిరివెళ్ల, రుద్రవరం మండలాల్లోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని సీఐ దస్తగిరి బాబు అన్నారు. శిరివెళ్ల సీఐగా పని చేస్తున్న వంశీధర్ వీఆర్‌కు వెళ్లడంతో అన్నమయ్య జిల్లాలో డీటీసీలో పని చేస్తున్న సీఐ దస్తగిరి బాబు శిరివెళ్లకు బదిలీపై వచ్చారు. దీంతో ఆయన సర్కిల్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. సీఐను శిరివెళ్ల, రుద్రవరం ఎస్ఐలు చిన్న పీరయ్య, వరప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

**రుద్రవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) :** రుద్రవరం సమీపంలో దొర్నీ చెంచులక్ష్మి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ధ్వజ, శిఖర కలశ, నాగ ప్రతిష్ఠ సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. పండితులు శేష ఫణిశర్మ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు సాగాయి. రాతి ధ్వజస్తంభాన్ని క్రేన్ సహాయంతో ప్రతిష్ఠించారు. శిఖర కలశ, నాగదేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బింబ భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చిన్నారులు చేసిన భరతనాట్యం, కూచిపూడి, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి.

## వేతనాలు విడుదల చేయాలి

**శిరివెళ్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి):** పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివ నాగమణి డిమాండ్ చేశారు. మండలంలోని గుండంపాడులో సోమవారం జీపుజాతా నిర్వహించారు. కూలీల వేతనాల కోసం మంగళవారం కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆమె కోరారు కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు రామచంద్రుడు, నరసింహ నాయక్, కోటకొండ బాషా, మద్దిలేటి పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

**కోవెలకుంట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ హాస్టల్‌లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని బనగానపల్లె నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000కి 970 మార్కులు సాధించిన సంకీర్తనను అభినందించి నగదు పురస్కారం అందించారు. అనంతరం వెలగటూరు రహదారిలో ఉన్న ప్రభుత్వ బాలికల వసతిగృహాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సోమశివారెడ్డి, డోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో వర ప్రసాదరావు, తహసీల్దారు పవన్ కుమార్‌రెడ్డి, ఎంఈవో వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేలబిలం ఆలయాభివృద్ధికి విరాళం

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం నేలబిలం ఆలయ అభివృద్ధి కోసం దాతలు విరాళంగా అందజేశారు. సోమవారం మండలంలోని మదనంతపురం గ్రామానికి చెందిన యాతం అశ్వర్థరెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు యాతం లక్ష్మీకాంతరెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ బాలవెంకటరెడ్డికి రూ.1,00,116 విరాళం అందజేశారు. దాత లక్ష్మీకాంతరెడ్డిని ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## డీఎస్పీని కలిసిన ఎస్ఐ

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** కొలిమిగుండ్ల యూపీఎస్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎం.గోపాల్ సోమవారం ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్‌ను కలిశారు. బాధ్యతలు తీసుకున్న తర్వాత మర్యాదపూర్వకంగా ఆళ్లగడ్డకు వెళ్లి డీఎస్పీతో భేటీ అయినట్లు వెల్లడించారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలని డీఎస్పీ ప్రమోద్ ఆదేశించారు.

## క్రీడల్లోనూ రాణించాలి

**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని జిల్లా విశ్రాంత న్యాయాధికారి శివనాగిరెడ్డి అన్నారు. సోమవారం రమణారెడ్డి ఆర్ఆర్ అకాడమి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా క్రికెట్ పోటీను నిర్వహించారు. పోటీలను విశ్రాంత జిల్లా న్యాయాధికారి ప్రారంభించారు. ప్రముఖ న్యాయవాది బీవీ సుబ్బారెడ్డి, కే రమాదేవి, ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మల్లేశ్వర్‌రెడ్డి, కర్నూలు జిల్లా క్రికెట్ కోచ్ ప్రసన్న కుమార్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఆర్ అకాడమి కోచ్ సుబ్బారాయుడు, విల్సన్, శేమ, ప్రవీణ్ కుమార్, వెంకట కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతి వేడుకలు

**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** ఆళ్లగడ్డలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిళంలో సోమవారం స్వాతి నక్షత్రం సందర్భంగా లక్ష్మీనరసింహ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల స్వామి ఆధ్వర్యంలో ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుదర్శన హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. అగ్నిమాపక దళ కేంద్రం ఇన్‌చార్జి అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానిక ప్రభ్వు ఆసుపత్రి వైద్యాధికారి శబరీష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

**బేతంచెర్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని మద్దిలేటి స్వామి క్షేత్ర ఈవో రామాంజనేయులు, ఎస్ఐ రమేష్‌బాబు అన్నారు. ఆర్ఎస్ రంగాపురంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి హోం టీమ్స్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో 20 కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. ఈవో సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## టీడీపీ నాయకుడిపై దాడి

**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని కోవెలకుంట్ల రస్తాలో టీడీపీ నాయకుడు సింగం భరత్‌రెడ్డిపై గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సోమవారం రాత్రి దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. ఆళ్లగడ్డ మున్సిపాలిటికీ సంబంధించిన గేటు వసూలు విషయంలో భరత్‌రెడ్డి ప్రశ్నించడంతో ఐదుగురు కర్రలతో దాడి చేశారు. దీంతో భరత్‌రెడ్డి తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ యుగంధర్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. బాధితుడు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసునమోదు చేస్తామని సీఐ తెలిపారు.

## సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

**డోన్ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో సెల్‌ఫోన్ దొంగలను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ డీఐజీ, ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని శ్రీరామ్‌నగర్, శ్రీసుధ పాఠశాల జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. కారులో అపహరించిన 52 మొబైల్ ఫోన్లను, 40 లీటర్ల నాటుసారా తరలిస్తున్న నగనూరి వంశీ, హాజీవలి అలియాజ అజ్జా, నగనూరు వసంత, ఓ బాలుడు పట్టుబడ్డారన్నారు. వారిని రిమాండ్‌కు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, ఏఎస్ఐ భాస్కర్, నరేంద్ర కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


డోన్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి


డోన్ ఆర్డీవో కార్యాలయంలో..


బనగానపల్లెలో..


బేతంచెర్లలో..


చాగలమర్రిలో..


ఆళ్లగడ్డలో..


కోటపాడులో రక్తదాతను అభినందిస్తున్న సీఐ


దొర్నిపాడులో..

# బహుముఖ ప్రజ్ఞాశాలి అంబేడ్కర్

- సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి
- వాడవాడలా అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళి

**డోన్ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** బహుముఖ ప్రజ్ఞశాలి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ ఆర్ అంబేడ్కర్ అని, నేటి తరం ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎంఎస్ఆర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ఈ రామ వేంద్ర, చాటకొండ శ్రీనివాసులు, గంధం శ్రీనివాసులు, మధుసూదన్ గౌడు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్ తదితరులు నివాళి అర్పించారు. పెన్షనర్ల సంఘం కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆ సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్, నాయకులు గాలయ్య, సుబ్బరాయుడు, గోపాల్, దాసప్ప, మౌలాలి నివాళిఅర్పించారు. అలాగే అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

**డోన్ టౌన్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఆర్డీవో కేపీ నరసింహులు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసాద్‌గౌడు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో డీఎం ఎం.శశిభూషణ్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ డీవై పుల్లయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణంలో సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సీఎం రాకేష్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. యూటీఎఫ్, ఎమ్మార్పీఎస్, మాలమహానాడు బీజేపీ, విద్యుత్ కార్యాలయం, ఎస్టీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

**● సీపీఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ**

భారతరత్న డా.బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రామాంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి పాతబస్టాండు మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పి.సుంకయ్య, బి.నారాయణ, కే.ప్రభాకర్, ఎస్‌కే రామ్మోహన్, అన్వర్ పాల్గొన్నారు.

**బేతంచెర్ల:** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాల, వైసీపీ, బీజేపీ, సీపీఐ నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి, ఎంపీపీ నాగభూషణం రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరి ప్రసాద్, చైర్మన్ చలంరెడ్డి, కౌన్సిల్ సభ్యులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించా రు.

**ప్యాపిలి:** అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్, సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం దగ్గర, ఎస్సీ కాలనీలో బాబా సాహెబ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు.


కొలిమిగుండ్ల బస్టాండ్‌లో నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీస్, కుల, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు

**కొలిమిగుండ్ల:** మండలంలోని వివిధ గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పెట్నీకోట గ్రామంలో మండల తెలుగు యువత అధ్యక్షులు గొంగటి హుస్సేన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామవరెడ్డి తదితరులు బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. కొలిమిగుండ్లలో ఎమ్మార్పీస్ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, మారెన్న, లైన్‌మెన్ జయానాయక్, సీపీఐ నాయకులు సూరి, కుల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వేడుకలు చేశారు. కోటపాడులో రక్తదాన శిబిరం నిర్వహించగా, సీఐ రమేష్ బాబు పాల్గొని రక్తదాతలను, ఎమ్మార్పీస్ నాయకులను అభినందించారు. ఎర్రగుడి, కోటపాడు, తుమ్మలపెంట, కొలిమిగుండ్ల టీడీపీ కార్యాలయం, పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిం చారు.

**కోవెలకుంట్ల:** పట్టణంలోని జమ్మలమడుగు సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నవ్యాంధ్రప్రదేశ్ మాలమహానాడు రాయలసీమ జిల్లా అధ్యక్షుడు జయన్న, జిల్లా అధ్యక్షుడు గంగన్న ,కార్యకర్తలు నివాళి అర్పించారు. అలాగే అధికారులు, పార్టీల, ప్రజాసంఘాల నాయకులు నివాళి అర్పించారు.

**రుద్రవరం:** మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మండల ప్రత్యేక అధికారి నాగరాజు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఎంపీపీ బాలస్వామి, చిన్నయ్యస్వామి చెంచుగూడెంలో రైతు సంఘం నాయకులు రామచంద్రుడు, రుద్రవరం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు నివాళి అర్పించారు.

**శిరివెళ్ల :** బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, డిప్యూటీ డీఈవో డీటీ శంకర్ ప్రసాద్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళి అర్పించారు.

**ఆళ్లగడ్డ:** పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రతినిధి ఓబులేసు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు సీనియర్ నాయకులు నాగిపోగుల ఓబులేసు, ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపతయ్య, రత్నమయ్య వేగుల జాని, రాజు, డాక్టర్ వెస్లీ, పాల్గొన్నారు. అలాగే ఆళ్లగడ్డలోని ఇరిగెల నివాసంలో జనసేన నియోజకవర్గ నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

**దొర్నిపాడు:** తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఉన్నారు.

**చాగలమర్రి:** మండల కేంద్రంలో పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు మౌలాలి, ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేరళ వైద్యశాల వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ , మాలమహానాడు, టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో, మల్లెవేముల సచివాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

**ఉయ్యాలవాడ:** తహసీల్దారు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్ శ్రీనివాసుల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ అంకన్న, వీఆర్వోలు , నాయకులు ఉన్నారు.

**బనగానపల్లె:** పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మండల స్పెషల్ అధికారి సుబ్బారెడ్డి, ఈవో సతీశ్‌రెడ్డి, బోదనం బాలనాగన్న నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో స్పెషల్ అధికారి సుబ్బారెడ్డి, ఎంపీడీవో రమణ, పశువైద్యశాలలో ఏడీ మారుతీసాకారం, ఎస్సీ, బీసీ బాలుర, బాలికల హాస్టళ్లలో, కళాశాల హాస్టళ్లలో ఆయా హాస్టల్ వార్డెన్లు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని అవుకు మెట్ట వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మాలమహానాయకుడు కేడం సుబ్బరాయుడు, మారం నాగరాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అలాగే పీఆర్‌టీయూ , విశ్వహిందూ పరిషత్, ఏపీటీఎఫ్ యూటీఎఫ్, ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

**అవుకు :** పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో అంబేడ్కర్ చిత్రపటానికి జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల దేవరత్నం, సుధాకర్, ఎస్‌హెచ్‌పీఆర్‌సీ సభ్యులు కంబగిరిస్వామి, పూలమాల వేసి నివాళి అర్పించారు. అవుకు ప్రభుత్వ ఆసుపత్రిలో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాత్రి ఈశ్వరయ్య, బాలుడు, నారాయణ, నాగేంద్రబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


రుద్రవరంలో..


శిరివెళ్లలో..


ప్యాపిలిలో..


ఉయ్యాలవాడలో..


కోవెలకుంట్ల..


అవుకులో..


బేతంచెర్లలో బీజేపీ నాయకుల నివాళి


సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ

# గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయం: మంత్రి బీసీ

**బనగానపల్లె, ఏప్రిల్ 14 ( ఆంధ్రజ్యోతి):** రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం మార్కెట్‌యార్డు ఆవరణంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తెల్ల జొన్నలను క్వింటాలు రూ. 3,371లకు 30వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణయించిన ట్లు తెలిపారు. ఇందుకు సీఎం చంద్రబాబుకు, పౌరసరఫరాశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జొన్న పంట అధికంగా పండే ప్రాంతాల్లో త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్‌సప్లై మేనేజరు నాయక్, మార్కుఫెడ్ డీఎం హరినాథరెడ్డి, నంద్యాల ఏడీ రాజశేఖర్, కోవెలకుంట్ల ఏడీ సుధాకర్, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, కోవెలకుంట్ల ఏవో నిరంజన్, అవుకు ఏవో అబ్దుల్‌హక్, బనగానపల్లె డీసీఎంఎస్ మేనేజర్ శంకర్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులు వేగవంతం చేయండి**

బనగానపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలో జరుగుతున్న షాదీఖానా పనులను ఆయన పరిశీలించారు. త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అలాగే మార్కెట్‌యార్డులో జరుగుతున్న గోదాము నిర్మాణం పనులను మంత్రి బీసీ పరిశీలించారు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ

## గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి

**బేతంచెర్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని గౌరిపేట ఆంజనేయస్వామి దేవాలయంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు గరుడ వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపు దేవస్థానం నుంచి గౌరిపేట, బైటిపేట, కానాలవారి సందు, నగర పంచాయతీ సందు, హభనుమాన్ నగర్, సంజీవ నగర్, బోయపేట, కూరగాయల మార్కెట్ మీదుగా తిరిగి దేవస్థానం చేరుకుంది. కార్యక్రమంలో ఈవీ సుజాత శర్మ, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, శ్రీనివాసులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## గ్యాస్ లీక్

**● వ్యాపించిన మంటలు**

**రుద్రవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని ఆలమూరులో సోమవారం గ్యాస్ పైపు లీకై మంటలు ఎగసిపడ్డాయి. ప్రమాదం త్రుటిలో తప్పింది. రోగెమ్మ అనే వృద్ధురాలు ప్రమాదం నుంచి బయటపడింది. ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. గ్యాస్ పైపు లీకై మంటలు ఎగిసి పడడంతో స్థానికులు ఆందో ళన చెందారు.

## అహోబిలంలో భారీ వర్షం

**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఎగువ అహోబిళంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మబ్బులతో ఆకాశం మేఘావృతంమై పట్టపగలే చీకట్లు అలుముకున్నాయి. స్వాతినక్షత్రం సందర్భంగా ఎగువ అహోబిళంలో నవనరసింహ క్షేత్రాల దర్శనార్థం వచ్చిన భక్తులు వర్షంతో తీవ్ర ఇ బ్బందులు పడ్డారు. మరోవైపు వేసవి తాపంతో సతమతమవుతున్న ప్రజలు కొంత ఊరట పొందారు.

## పౌష్టికాహారం తీసుకోవాలి

**కొలిమిగుండ్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) :** ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని హెచ్ఎం సుంకన్న అన్నారు. సోమవారం కొలిమిగుండ్ల అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త అనిత ఆధ్వర్యంలో పోషణ్ పక్వడా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భవతులు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మహిళలు క్రమపద్ధతిలో పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. సమావేశంలో హెచ్ఎం సుంకన్న, కరెంటు ఆదిఆనారాయణ పాల్గొన్నారు.

## మోడల్ పాఠశాలలుగా ఎంపిక

**చాగలమర్రి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):** మండలంలో కొత్తగా 12 మోడల్ పాఠశాలలను ఎంపిక చేసినట్లు ఎంఈవో అనురాధ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ చాగలమర్రి మెయిన్ పాఠశాల, గుంతపాలెం, గిరిజన కాలనీ, ముత్యాలపాడు, చిన్న బోధనం, మద్దూరు, మల్లేవేముల, చిన్నవంగలి, చింతలచెరువు, పెద్ద వంగలి, శెట్టివీడు, గొడిగెనూరు. గ్రామలలోని ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేశామన్నారు. ప్రతి పాఠశాలకు ప్రత్యేకంగా హెచ్ఎం కొనసాగుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో న్యామతుల్లా, సీఆర్‌పీలు ఉన్నారు.

## యువతకు మార్గదర్శకం కావాలి


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

**బనగానపల్లె, ఏప్రిల్ 14 ( ఆంధ్రజ్యోతి):** యువతకు రెయిన్‌బో సొసైటీ మార్గదర్శకం కావాలని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పాత బస్టాండ్‌లోని బీసీ గురెడ్డి కాంప్లెక్స్‌లో గోకుల దిన్నెకు చెందిన మధుసూదన్‌రెడ్డి రెయిన్‌బో ఎడ్యుకేషనల్ సొసైటీని బీసీ రాజారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.